భూ భారతి రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలి 4

Neti Velugu

నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 207 | పేజీలు : 4 | నవంబర్ 12 గురువారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 207 | PAGES:4 | THURSDAY NOVEMBER 12 2026 | Rs. 4:00

తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు..

వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

వచ్చే విద్యా సంవత్సరం నుంచే తెలంగాణలో 10ం2 విధానం

అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం

12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా మౌలిక వసతులు



రాష్ట్ర విద్యా వ్యవస్థలో భారీ మార్పులకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పాఠశాల విద్యలో 10ం2 విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంస్కరణల అమలులో ఏ ఒక్క విద్యార్థికి నష్టం (మిగతా 2వ పేజీలో..)

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి విక్రమార్క

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క

సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం

పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని విద్యానగర్‌లో నూతన (మిగతా 2వ పేజీలో..)



ఏపీకి మరో వాయుగుండం ముప్పు.. ఈ తేదీల్లో వర్షాలు కురిసే ఛాన్స్!

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఎల్లుండి అల్పపీడనం

ఇది బలపడి వాయుగుండంగా మారే అవకాశం

నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా

దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



ఆంధ్ర ప్రదేశ్‌లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఎల్లుండి అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఇది (మిగతా 2వ పేజీలో..)

ఆటో, ఈవీ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యం.. పారిశ్రామికవేత్తలతో మంత్రి పొన్నం భేటీ

మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి భేటీ

సమావేశానికి హాజరైన 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు

వచ్చే నెలలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై దృష్టి

తెలంగాణను అగ్రగామిగా నిలపడమే ధ్యేయమన్న మంత్రి



తెలంగాణను ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వచ్చే నెలలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'ను దృష్టిలో (మిగతా 2వ పేజీలో..)

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం

రూ. 3,230 కోట్ల ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

నార్త్, సౌత్ బ్లాక్ భవనాల్లో భారీ మ్యూజియం నిర్మాణం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలంగా రికార్డు

2027 ద్వితీయార్థంలో తొలి గ్యాలరీ ప్రారంభం

ఏడాదికి కోటి మంది సందర్శకుల రాక

అంచనా

భారతదేశ ఘనమైన చరిత్ర, నాగరికత, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన బృహత్తర ప్రాజెక్టు 'యుగే యుగీ భారత్ నేషనల్ మ్యూజియం' నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (జజజూూ) అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.3,230 కోట్లుగా నిర్ణయించారు.న్యూఢిల్లీలోని రైసినా హిల్స్‌పై రాష్ట్రపతి భవన్‌కు ఇరువైపులా ఉన్న చారిత్రక నార్త్, సౌత్ బ్లాకుల్లో ఈ సరికొత్త జాతీయ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నారు. 1912 నుంచి 1931 మధ్య కాలంలో నిర్మించిన ఈ కట్టడాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు ఇతర నూతన భవనాల్లోకి మారిన తర్వాత, వాటిని ప్రజా సాంస్కృతిక (మిగతా 2వ పేజీలో..)



80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య

యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ (మిగతా 2వ పేజీలో..)

తెలంగాణ ఉద్యమానికి నిర్మల్ గడ్డతో విడదీయలేని బంధం: కేటీఆర్

ఇక్కడి నుంచే తెలంగాణ సాధనకు కేసీఆర్ ఉద్యమ సంకల్పం

1996 ఉప ఎన్నికల సమయంలో పోచంపాడు ప్రాజెక్టును సందర్శించిన కేసీఆర్

తెలంగాణ సాధిస్తానని తొలిసారి ప్రకటించిన ప్రాంతం ఇదేనని వెల్లడి

నిర్మల్ రైతు గర్జన సభలో ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తుచేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



నిర్మల్: తెలంగాణ ఉద్యమానికి నిర్మల్ గడ్డతో విడదీయలేని (మిగతా 2వ పేజీలో..)

అమిత్ షా విశాఖ పర్యటన రద్దు

విశాఖపట్నంలో రేపు ప్రారంభం కానున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు

అనివార్య కారణాలతో అమిత్ షా పర్యటన రద్దు

ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



విశాఖపట్నం వేదికగా గురువారం ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు కావడం లేదు. అనివార్య కారణాల వల్ల ఆయన విశాఖ పర్యటన రద్దయినట్లు కేంద్ర హోంశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా సమాచారం అందించింది. దీంతో అమిత్ షా స్థానంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నవంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నారు. సీఐఐ, కేంద్ర వాణిజ్య (మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సంపాదకీయం

వలసలకు అడ్డుకట్ట.. గ్రామీణ ఉపాధికి పెద్దపీట!

ఉపాధి కోసం సొంత ఊరును, కుటుంబాన్ని, ఆత్మీయులను వదిలి పట్టణాలు, నగరాలకు వలస వెళ్లడం నేడు అనేక కుటుంబాల్లో సాధారణంగా మారింది. మెరుగైన ఆదాయం, ఉద్యోగ అవకాశాలు, జీవన ప్రమాణాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పట్టణాల బాట పడుతున్నారు. అయితే ఈ వలసల వెనుక ప్రధాన కారణం గ్రామాల్లో తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడమే. గ్రామాల్లోనే గౌరవప్రదమైన జీవనోపాధి లభిస్తే ప్రజలు తమ ప్రాంతాలను వదిలి వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది.

గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలి

వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు ఏడాది పొడవునా పని పొందలేకపోతున్నారు. వర్షాధార సాగు, పంటల ధరల్లో అనిశ్చితి, పెట్టుబడి ఖర్చులు పెరగడం వంటి సమస్యలు గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, ఆహార తయారీ, చిన్న పరిశ్రమలు, చేతివృత్తులకు ప్రోత్సాహం కల్పిస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.ప్రతి గ్రామానికి అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి వాటికి అనుగుణంగా పరిశ్రమలు, స్వయం ఉపాధి కార్యక్రమాలను రూపొందించాలి. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగాలు ఏర్పడతాయి.

యువతకు నైపుణ్య శిక్షణ అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతకు తగిన నైపుణ్యాలు, ఉద్యోగ మార్గదర్శకత్వం అందుబాటులో ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, అకౌంటింగ్, సాంకేతిక విద్య, యంత్రాల నిర్వహణ, డిజిటల్ సేవలు, వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ కల్పించాలి. కేవలం సర్టిఫికెట్లు అందించడం కాకుండా వాస్తవంగా ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అనుభవాన్ని కూడా కల్పించాలి.స్థానిక పరిశ్రమలు, విద్యాసంస్థలు, నైపుణ్య శిక్షణ కేంద్రాల మధ్య అనుసంధానం పెరగాలి. ఏ ప్రాంతంలో ఏ రంగానికి ఉద్యోగులు అవసరమో ముందుగానే గుర్తించి శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తే నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించవచ్చు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు దాని అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడం అవసరం. పాలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తులను నిల్వ చేసే గిడ్డంగులు, శీతలీకరణ కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి తగ్గుతుంది.రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంస్థలను బలోపేతం చేయాలి. చిన్న రైతులు సమష్టిగా ఉత్పత్తులను విక్రయించేందుకు, మార్కెట్లతో నేరుగా అనుసంధానం కావడానికి అవసరమైన సహకారం అందించాలి. వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకుని చిన్న వ్యాపారాలు ప్రారంభించే యువతకు రుణాలు, శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి.

మహిళలకు స్థానికంగానే ఉపాధి

గ్రామీణ మహిళల్లో ఎన్నో నైపుణ్యాలు ఉన్నప్పటికీ వాటిని ఆదాయ వనరులుగా మార్చుకునే అవకాశాలు పరిమితంగా ఉంటున్నాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తయారు చేసే వస్తువులకు మెరుగైన మార్కెట్ కల్పించాలి. ఆహార పదార్థాల తయారీ, కుట్టుపని, చేతివృత్తులు, పశు పోషణ, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం ఇవ్వాలి.మహిళా సంఘాలకు రుణాలు అందించడం మాత్రమే కాకుండా వ్యాపార నిర్వహణ, నాణ్యత, ప్యాకేజింగ్, అమ్మకాలు, డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వాలి. వారి ఉత్పత్తులను ప్రభుత్వ, ప్రైవేటు మార్కెట్లకు అనుసంధానిస్తే ఆదాయ అవకాశాలు విస్తరిస్తాయి. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయి.

సొంత ఊరిలోనే ఉపాధి.. సంతోషకరమైన జీవితం

వలసలు పూర్తిగా ఆగిపోవాలని ఆశించడం వాస్తవికం కాదు. మెరుగైన విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం వలస వెళ్లడం కొన్నిసార్లు అభివృద్ధికి మార్గం కూడా కావచ్చు. కానీ ఆర్థిక ఇబ్బందుల వల్ల, ఉపాధి లేక తప్పనిసరిగా ఊరు వదిలి వెళ్లే పరిస్థితిని తగ్గించాలి. గ్రామీణ ప్రాంతాల్లోనే ఆదాయం పొందే అవకాశాలు పెరిగితే కుటుంబ సంబంధాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థ, సామాజిక జీవనం బలోపేతమవుతాయి. గ్రామాలు బలపడితేనే దేశ అభివృద్ధికి పునాది పటిష్ఠమవుతుంది. రైతుకు గిట్టుబాటు ధర, యువతకు నైపుణ్య శిక్షణ, మహిళలకు స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం, మెరుగైన మౌలిక వసతులు కల్పించినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి వస్తుంది. ఉపాధి కోసం సొంత ఊరును వదిలి వెళ్లాల్సిన పరిస్థితి తగ్గి, సొంత ప్రాంతంలోనే గౌరవప్రదంగా జీవించే అవకాశాలు పెరగాలి. గ్రామీణ ఉపాధి బలోపేతమే సమతుల్య అభివృద్ధికి నిజమైన మార్గం!

తెలంగాణ ఉద్యమానికి నిర్మల్ గడ్డతో విడదీయలేని బంధం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

అనుబంధం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నేతృత్వంలో సాగిన తెలంగాణ ఉద్యమానికి ఈ చారిత్రక ప్రాంతం కీలక సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు. నిర్మల్ రైతు గర్జన సభలో ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ సాధారణ ప్రాంతం కాదని, చదువుల తల్లి సరస్వతీ దేవి కొలువైన పుణ్యభూమి అని కొనియాడారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన నిర్మల్ పెయింటింగ్స్, బొమ్మల తయారీలో నైపుణ్యం కలిగిన కళాకారులు వర్ధిల్లుతున్న ధన్యభూమి అని అభివర్ణించారు.

1996లో పోచంపాడు ప్రాజెక్టును సందర్శించిన కేసీఆర్..

సరిగ్గా 30 ఏళ్ల క్రితం, 1996లో నిర్మల్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చిన సమయంలో కేసీఆర్ మంత్రిగా ఇక్కడికి ఎన్నికల ఇన్‌చార్జిగా వచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ పర్యటనలో కొంత సమయం లభించడంతో తన మిత్రులతో కలిసి పోచంపాడు ప్రాజెక్టును సందర్శించారని తెలిపారు. ప్రాజెక్టు గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్ కూడా చేయకపోవడంతో అవి తుప్పు పట్టిపోయి ఉన్నాయని కేసీఆర్ గమనించినట్లు వివరించారు.

ప్రాజెక్టుల దుస్థితి చూసి ఉద్యమ సంకల్పం..

ఒకప్పుడు ఎంతో ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురై, శివాలయంలా మారి అనాథగా మిగిలిపోయిన పరిస్థితిని చూసి కేసీఆర్ చలించిపోయారని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ప్రాంతంలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురవుతుంటే, దిగువ ఆంధ్రా ప్రాంతానికి నీటిని తరలించే ప్రాజెక్టులు మాత్రం వైభవంగా ఉన్నాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అవసరమైతే ఉద్యమానికి శ్రీకారం చుడతానని, భగవంతుడు శక్తినిస్తే తెలంగాణను సాధిస్తానని కేసీఆర్ ఇదే నిర్మల్ గడ్డపై ప్రకటించారని కేటీఆర్ వెల్లడించారు.

తెలంగాణ సాధనకు తొలి సంకల్పం ఇక్కడే..

తెలంగాణ ఉద్యమానికి సంబంధించి కేసీఆర్ తన సంకల్పాన్ని తొలిసారిగా ప్రకటించిన ప్రాంతం నిర్మలేనని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమ ప్రస్థానంలో నిర్మల్‌కు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఆనాడు కేసీఆర్ వ్యక్తం చేసిన సంకల్పం తర్వాతి కాలంలో తెలంగాణ ఉద్యమానికి బలమైన పునాదిగా మారిందని సభలో గుర్తుచేశారు.

తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు.. వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

మొదటి పేజీ తరువాయి)

జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి విద్యార్థులకు ప్రత్యేక విద్య అందించాలని సూచించారు.విద్యార్థులకు 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ (స్కిల్లింగ్) అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు.

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి)

'తెలంగాణ పబ్లిక్ స్కూల్' భవన నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్', 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధన అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరోవైపు, ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో ముందస్తు చర్యగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి)

కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఈ క్రమంలో భవనాల అసలు శైలి, చారిత్రక నిర్మాణ వారసత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా పునరుద్ధరించనున్నారు.ఈ మ్యూజియం ద్వారా భారతదేశ అనాది నాగరికతా ప్రయాణం, వైవిధ్యం, భౌతిక మరియు అభౌతిక వారసత్వాన్ని సమగ్రంగా ప్రదర్శించనున్నారు. అత్యాధునిక ఇమ్మర్సివ్ సాంకేతికత, సందర్శకులను ఆకట్టుకునే ప్రత్యేక థీమాటిక్ గ్యాలరీలతో అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలకు ధీటుగా దీనిని రూపొందిస్తున్నారు. పూర్తయిన తర్వాత సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలం (డిస్‌ప్లే ఏరియా) కలిగిన మ్యూజియంగా ఇది రికార్డు సృష్టించనుంది.ఈ ప్రాజెక్టును 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు దశలవారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి పబ్లిక్ గ్యాలరీ అయిన 'అడోర్న్‌మెంట్'ను నార్త్ బ్లాక్‌లో 2027 ద్వితీయార్ధంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మ్యూజియాన్ని ఏటా దాదాపు ఒక కోటి మందికి పైగా సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.కేబినెట్ ఆమోదించిన రూ.3,230 కోట్ల నిధులను గ్యాలరీల అభివృద్ధి, ప్రాచీన వస్తువుల భద్రత, పరిరక్షణ, సందర్శకుల సౌకర్యాలు, ల్యాండ్‌స్కేపింగ్, ఇంటెలిజెంట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, అధునాతన మౌలిక వసతుల కల్పన కోసం వినియోగిస్తారు. భవిష్యత్తులో టికెట్ల విక్రయాలు, ఆహార మరియు పానీయాల విభాగాలు, ప్రత్యేక కార్యక్రమాల వేదికల అద్దెలు, డిజిటల్ అనుభవాలు, గైడెడ్ టూర్లు మరియు ప్రత్యేక రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా మ్యూజియానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు. ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ 2023 మే 18న తొలిసారిగా ప్రకటించగా, 2026 జూలై 27న పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు దీనికి ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. తాజా కేబినెట్ ఆమోదంతో పనులు మరింత వేగవంతం కానున్నాయి.

ఆటో, ఈవీ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యం.. పారిశ్రామికవేత్తలతో మంత్రి పొన్నం భేటీ

మొదటి పేజీ తరువాయి)

ఉంచుకుని ఈ దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఆటో, ఈవీ రంగాల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం జరిగింది.హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో సుమారు 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అగ్రశ్రేణి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆటోమొబైల్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలు, బ్యాటరీ టెక్నాలజీ, క్లీన్ మొబిలిటీ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. కొత్త యూనిట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న పరిశ్రమల విస్తరణ, విధానపరమైన అవసరాలపై పరిశ్రమ వర్గాల నుంచి మంత్రి సూచనలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్‌కు సన్నాహాల్లో భాగంగానే ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోనే ఆటోమొబైల్, ఈవీ పెట్టుబడులకు తెలంగాణను అగ్రగామి గమ్యస్థానాల్లో ఒకటిగా నిలపడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమ్మిట్‌లో ఈ రంగాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించేందుకు అవసరమైన కీలక అంశాలను కూడా ఈ సమావేశంలో గుర్తించారు.

ఏపీకి మరో వాయుగుండం ముప్పు.. ఈ తేదీల్లో వర్షాలు కురిసే ఛాన్స్!

మొదటి పేజీ తరువాయి)

క్రమంగా బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని తెలిపింది. నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా వేసింది.అల్పపీడనం ఏర్పడిన 24 గంటల్లోనే తీవ్ర అల్పపీడనంగా బలపడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ ఉత్తర తమిళనాడు తీరం వైపు కదులుతుందని వివరించారు.ఈ ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే భారీ వర్షాల కంటే తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలే ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఆ తర్వాత అల్పపీడనం కదలికను బట్టి వర్షాల పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

అమిత్ షా విశాఖ పర్యటన రద్దు

మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేశాయి. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ సదస్సు జరుగుతోంది. దీనికి దాదాపు 58 దేశాల నుంచి దౌత్యవేత్తలు, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రముఖులు హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు కో-ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 13న జరిగే ముగింపు సమావేశానికి భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

15న రైతు సంఘం బహిరంగ సభకు వేలాదిగా తరలిరండి

● **ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి పిలుపు**

నల్లగొండ నవంబర్ 11 (నేటి వెలుగు):

అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలు నవంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్నట్లు ఐద్వా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి తెలిపారు. ఈ మహాసభల్లో భాగంగా నవంబర్ 15న ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే చారిత్రాత్మక మహా ప్రదర్శన, బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.బుధవారం కనగల్ మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపు ప్రచార జాతను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని అన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి డిమాండ్లు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని, రైతుల రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించి వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కల్పించాలని, కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, మహిళా రైతులకు గుర్తింపు, హక్కులు కల్పించాలని, రైతాంగానికి సామాజిక భద్రతతో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

జాతీయ నాయకులు హాజరు



నవంబర్ 15న జరిగే బహిరంగ సభకు ప్రధాన వక్తలుగా మాజీ పార్లమెంటు సభ్యురాలు బృందాకారత్, అఖిల భారత రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే, జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ హాజరుకానున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సభకు అధ్యక్షత వహిస్తారని, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.కనగల్ మండలంలో ప్రారంభమైన ప్రచార జాతను గ్రామగ్రామాన విస్తృతంగా నిర్వహించి రైతులు, ప్రజలను చైతన్యపరచాలని ఆమె పిలుపునిచ్చారు. రైతాంగ ఐక్యతను చాటుతూ నవంబర్ 15న నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకురాలు ఎం.డి. సుల్తానా, రైతు సంఘం నాయకులు బ్రహ్మానందరెడ్డి, మారయ్య, అక్రమ్, సాయమ్మ, ధనమ్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి





● **రైతుల సమక్షంలోనే భూముల హద్దుల నిర్ధారణ జరగాలి: జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి**

రంగారెడ్డి జిల్లా, నవంబర్ 11(నేటి వెలుగు):

భూ రీసర్వే ప్రక్రియలో ప్రతి రైతుకు సంబంధించిన భూములను క్షేత్రస్థాయిలో కచ్చితంగా గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం ఇబ్రహీంపట్నం మండలం రాందాస్‌పల్లి గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును, రైతుల భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతుకు చెందిన భూమి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని, భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సర్వే నిర్వహణకు కనీసం 24 గంటల ముందుగానే సంబంధిత గ్రామంలోని పట్టాదారులకు నోటీసులు అందించాలని స్పష్టం చేశారు. ఏ రోజు, ఏ సమయంలో, ఏ ప్రాంతంలో సర్వే నిర్వహించనున్నారనే వివరాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని, నోటీసులు అందించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేకు హాజరైన రైతులతో పాటు, నోటీసులు అందించినప్పటికీ హాజరుకాని పట్టాదారుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు.సర్వే సంబర్ల ప్రాతిపదికన మాత్రమే కాకుండా రైతుల వారీగా భూములను గుర్తించి హద్దులు నిర్ధారించాలని తెలిపారు. ప్రతి రైతుకు చెందిన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చోట ఫ్లాగ్‌లు ఏర్పాటు చేయాలని, రైతులకు భూమి సరిహద్దులను ప్రత్యక్షంగా చూపిస్తూ వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి సర్వే వివరాలకు, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలకు మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే బృందాలు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు చేరుకుని, సంబంధిత రైతులకు ముందస్తు సమాచారం అందిస్తూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ సునీత, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పురాతన కట్టడాలు, దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత





● **ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్లగొండ, నవంబర్ 11(నేటి వెలుగు):

పురాతన, చారిత్రక కట్టడాలు, దేవాలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నల్లగొండ సమీపంలోని పానగల్‌లో గల ప్రసిద్ధ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన 'వారసత్వ నడక' (హెరిటేజ్ వాక్) కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందిన చారిత్రక ఆలయమని, రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు ఈ ఆలయాన్ని సందర్శించేందుకు వస్తుంటారని తెలిపారు. 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో ఈ దేవాలయం నిర్మితమైనట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోందన్నారు. హెరిటేజ్ వాక్ ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టత గురించి మరింత తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.ఇలాంటి పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి బడ్జెట్ కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో ఆలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించడం సంతోషకరమని అన్నారు.

ఆలయ పరిరక్షణకు ఇంటాక్ కృషి



ఇంటాక్ న్యూఢిల్లీ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. పురాతన కట్టడాలను పునరుద్ధరించడం, వాటి చారిత్రక వైభవాన్ని కాపాడటమే ఇంటాక్ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నల్లగొండ ఇంటాక్ చాప్టర్‌ను ప్రారంభించే క్రమంలో జిల్లాకు వచ్చి ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, వేద్ కుమార్, సజ్జాద్ సాహిది, ధనుంజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

15న బహిరంగ సభను జయప్రదం చేయండి

● **ప్రచార జాతాలు ప్రారంభించిన జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి**

నల్గొండ నవంబర్ 11(నేటి వెలుగు)



అఖిలభారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 15న ఎన్జీ కాలేజీ గ్రౌండ్లో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారుబుధవారం నల్గొండ నియోజకవర్గ పరిధిలోని నల్గొండ టౌన్ మండలం తిప్పర్తి కనగల్లు మాడుగుల పెళ్లి మండలాల ప్రచార జీపు జాతాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పోరుగడ్డ నల్లగొండ నగరంలో 36వ ఏఐకెఎస్ జాతీయ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ మహాసభల సందర్భంగా 15న బహిరంగ సభ లక్ష మందితో నిర్వహించాలని విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు 14 నుండి 16 వరకు పెదగడియారం సెంటర్లో వ్యవసాయ యంత్రాల ప్రదర్శన అగ్రి షో ఆటపాట కళాకారుల పోరాట కార్యక్రమాలు 16 నుండి 18 వరకు ప్రతినిధుల సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై సంఘటితమైన పోరాటాలు చేయడానికి ఈ మహాసభలలో కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు రైతు రక్షణ కోసం నలగొండ వేదిక కానున్న నేపథ్యంలో రైతులు కార్మికులు యువకులు మహిళలు 15 జరిగే బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హశం, ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ ,రైతు సంఘం నాయకులు నలపరాజు సైదులు పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి,సర్దార్ అలీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మన్నెం బిక్షం, కెవిపిఎస్ జిల్లా సహాయ ఉపాధ్యక్షులు గాదె నరసింహ తదితరులు పాల్గొన్నారు

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2026 జిల్లా స్థాయి పోటీలు

● **విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి: డీఈఓ శ్రీనివాసరావు**

సూర్యాపేట నవంబర్ 11(నేటి వెలుగు):

32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2026 జిల్లా స్థాయి పోటీలను దురాజ్‌పల్లిలోని ఎం.ఎస్.ఆర్. సెంట్రల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి, జిల్లా కోఆర్డినేటర్ శ్రీ ఎల్. దేవరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సి.హెచ్. శ్రీనివాసరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు సైన్స్ పరిష్కార మార్గాలను చూపిస్తుందని అన్నారు. విద్యార్థులంతా చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలు, శాస్త్రీయ అవగాహన పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ జిల్లా స్థాయి పోటీల్లో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ పరిశోధనలు, ప్రాజెక్టుల ద్వారా ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ జింకర శ్రీనివాస్, స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ టి. లక్ష్మీరాజం, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో 480 ఇందిరమ్మ టవర్ల నిర్మాణం

● **అర్హులైన వారు డిసెంబర్ 5లోగా మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్లగొండ, నవంబర్ 11(నేటి వెలుగు):



తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మామిళ్లగూడ వద్ద 480 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు.ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.579 ద్వారా జి+5 అంతస్తుల బ్లాకుల్లో 480 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చిందన్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి రూ.8.50 లక్షలు ఖర్చు అవుతుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని, మిగిలిన రూ.3.50 లక్షలను లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

డిసెంబర్ 5లోగా దరఖాస్తు చేసుకోవా

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివసిస్తున్న అర్హులైన వారు మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో డిసెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

దరఖాస్తుదారులకు అర్హతలు:

1. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఇంటి స్థలం ఉండకూడదు.
2. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించకూడదు.
3. ఒక్క కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
4. దరఖాస్తుదారు తప్పనిసరిగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాసం ఉండాలి.

ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

హైద్రాబాద్ నవంబర్ 11(నేటి వెలుగు):



భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు.జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ.. విద్యతోనే వ్యక్తి వికాసం, విజ్ఞానం పెరుగుతాయని, ప్రతి మనిషి జీవితంలో వెలుగులు నింపే శక్తివంతమైన ఆయుధం విద్య అని పేర్కొన్నారు.సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలందరికీ సమానంగా నాణ్యమైన విద్య అందినప్పుడే నిజమైన సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికీ విద్యను అందించడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు.పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకాలు కలగకుండా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ వసతి వంటి సౌకర్యాలను ప్రభుత్వం సమర్థవంతంగా కల్పించాలని కోరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. సవీన్ కుమార్ గౌడ్

వేసవి తాగునీటి అవసరాలకు ప్రత్యామ్నాయ జలవనరులపై జలమండలి దృష్టి





ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ముందస్తు చర్యలు

గండిపేటలో పర్యటించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఉన్నతాధికారుల బృందం

హైదరాబాద్, నవంబర్ 11(నేటి వెలుగు):

ఎల్‌నినో ప్రభావం, రాబోయే వేసవిలో పెరగనున్న తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలు చేపడుతోంది. నగరానికి ప్రధాన జలవనరులైన సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి బుధవారం ఉన్నతాధికారుల బృందంతో కలిసి గండిపేట, పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల నుంచి నగరానికి అదనపు తాగునీటిని సరఫరా చేసే అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాబోయే ఫిబ్రవరి, మార్చి నెలల్లో పెరిగే తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంట జలాశయాల నుంచి అదనంగా ఎంత నీటిని సేకరించవచ్చు, ఏ మార్గాల ద్వారా నగరానికి తరలించవచ్చు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పైప్‌లైన్ వ్యవస్థతో వాటిని ఎలా అనుసంధానం చేయవచ్చనే అంశాలపై అధికారులతో చర్చించారు. అదనపు నీటి తరలింపునకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రత్యామ్నాయ పైప్‌లైన్ మార్గాలు, భవిష్యత్ విస్తరణ అవకాశాలను పరిశీలించారు. నీటి లభ్యత, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, సరఫరా వ్యవస్థ సామర్థ్యాన్ని సమగ్రంగా అంచనా వేసిన అనంతరం తదుపరి కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నారు. రాబోయే వేసవిలో తాగునీటి డిమాండ్ పెరిగే అవకాశాలున్నందున అందుబాటులో ఉన్న ప్రతి జలవనరును సమర్థంగా వినియోగించుకునే మార్గాలను అన్వేషించాలని ఎండీ అధికారులకు సూచించారు. ముఖ్యంగా సింగూరు, మంజీరా జలవనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. నగర ప్రజలకు వేసవిలోనూ నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు అన్ని అవకాశాలను పరిశీలిస్తూ ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు జలమండలి వెల్లడించింది. ఈ పర్యటనలో జలమండలి ప్రాజెక్ట్స్ డైరెక్టర్ మహేష్ కుమార్, సీఈఓ రాంబాబుతో పాటు ప్రాజెక్టు, ట్రాన్స్‌మిషన్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

027--28 విద్యా సంవత్సరం నుంచే చిలుకూరు యంగ్ ఇండియా పాఠశాలలో తరగతులు ప్రారంభించాలి

- నిర్మాణ పనులను వేగవంతం చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- చిలుకూరులో రూ.200 కోట్లతో, కోదాడలో రూ.50 కోట్లతో విద్యాసంస్థల నిర్మాణం

కోదాడ, నవంబర్ 11(నేటి వెలుగు):



కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు గుట్టల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు, కోదాడలో రూ.50 కోట్లతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా చిలుకూరు గుట్టల్లో 22 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. బేస్‌మెంట్, కాంక్రీట్, పిల్లర్ల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, 2027--28 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.అనంతరం కోదాడ పట్టణంలో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. పనుల పురోగతిపై కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి పాఠశాల ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే. నరసింహ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో భోజనశాల ప్రారంభించిన శాసన మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ పట్టణం నవంబర్ 11 (నేటి వెలుగు)



దేవరకొండ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన భోజనశాలను గుత్తా సుఖేందర్ రెడ్డి, బాలు నాయక్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. భక్తుల సౌకర్యార్థం భోజనశాలను ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సామరస్యం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. అయ్యప్ప స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ అభివృద్ధికి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్న ఆలయ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు.

నాగం శ్రీదేవిపై దాడి ఘటన.. జాతీయ మహిళా కమిషన్ నిజనిర్ధారణ కమిటీ క్షేత్రస్థాయి విచారణ

నల్గొండ, నవంబర్ 11 (నేటి వెలుగు):



నల్గొండ పట్టణంలో భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి తల్లి నాగం శ్రీదేవిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి జాతీయ మహిళా కమిషన్ నిజనిర్ధారణ కమిటీ మంగళవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది.ఈ విచారణలో భాగంగా జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు శ్రీమతి నివేదితా సుబ్రమణియన్, సీనియర్ కోఆర్డినేటర్ శ్రీమతి కంచన్ ఖట్టర్ నల్గొండ పట్టణంలోని నాగం శ్రీదేవి నివాసాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా దాడి జరిగిన ప్రదేశాన్ని స్వయంగా పరిశీలించి, ఘటన జరిగిన తీరును, ఇంటి వద్ద ధ్వంసమైన వస్తువులను, ఆస్తి నష్టాన్ని పరిశీలించారు. అనంతరం బాధితురాలు నాగం శ్రీదేవిని, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల నుంచి ఘటనకు సంబంధించిన ఆధారాలు, ఇతర వివరాలను సేకరించి విచారణ నిర్వహించారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని జాతీయ మహిళా కమిషన్ కమిటీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్ఆర్ ప్రైమ్ విద్యార్థి ఎంపిక!

అండర్--17 విభాగంలో ప్రతిభ చాటిన చాణక్య రెడ్డి

నల్గొండ, నవంబర్ 11 (నేటి వెలుగు):



ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీల్లో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థి చాణక్య రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.మిర్యాలగూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 14, 17 సంవత్సరాల బాలబాలికలకు బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్--17 బాలుర విభాగంలో చాణక్య రెడ్డి విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.చాణక్య రెడ్డి ప్రస్తుతం నల్లగొండలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. ఆయనకు శిక్షణ అందించిన కోచ్‌లు రామకృష్ణ, ప్రకాష్ నారాయణలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ విద్యాసంస్థల స్కూల్ జోనల్ ఇన్‌చార్జి దోనల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా చాణక్య రెడ్డిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ చాణక్య రెడ్డికి అభినందనలు తెలిపారు.

డిసెంబర్ చివరి నాటికి రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి







- కాంట్రాక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం
- రూ.47.64 కోట్లతో 4,460 ఎకరాలకు సాగునీరు.. 1,486 కుటుంబాలకు లబ్ధి

కోదాడ, నవంబర్ 11(నేటి వెలుగు):

కోదాడ మండలం రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై నిర్మిస్తున్న రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులను రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ముందుగా కాలువ పనులు, అండర్‌గ్రౌండ్ మోటార్లు, సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రూ.47.64 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా మొత్తం 4,460 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా కోదాడ మండలంలోని ద్వారకుంట గ్రామంలో 66 ఎకరాలు, నల్లబండగూడెంలో 1,400 ఎకరాలు, కాపుగల్లులో 1,608 ఎకరాలు, కూచిపూడిలో 400 ఎకరాలు, రెడ్లకుంటలో 576 ఎకరాలు, చిమిరాలలో 410 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు.430 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వీఈటీ మోటార్ల సహాయంతో ఆయకట్టుకు నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మొత్తం 1,486 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని పేర్కొన్నారు. వీరిలో ఓసీ వర్గానికి చెందిన 290, బీసీ వర్గానికి చెందిన 720, ఎస్టీ వర్గానికి చెందిన 30, ఎస్సీ వర్గానికి చెందిన 446 కుటుంబాలు ఉన్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలి

బోగారం గ్రామంలో అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, నవంబర్ 11 (నేటి వెలుగు):

భూ రికార్డుల ఆధునీకరణ, భూ సరిహద్దు వివాదాల శాశ్వత పరిష్కారం, రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ భారతి రీ-సర్వే ప్రక్రియపై ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు.బుధవారం కీసర మండలం బోగారం గ్రామంలో రైతులు, గ్రామస్తులకు భూ భారతి రీ-సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రీ-సర్వేలో భాగంగా 1954 నాటి పాత సర్వే రికార్డుల సమాచారాన్ని సేకరించి, ప్రస్తుతం నిర్వహించే కొత్త రీ-సర్వే వివరాలతో సరిపోల్చి భూ రికార్డులను నవీకరిస్తారని తెలిపారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా ప్రతి భూభాగాన్ని ఖచ్చితమైన భౌగోళిక కో-ఆర్డినేట్లతో గుర్తించి, డిజిటల్ కో-ఆర్డినేట్లతో కూడిన ప్రత్యేక నంబర్ కేటాయించి రిజిస్టర్లలో నమోదు చేస్తారని వివరించారు.

రైతులకు అనేక ప్రయోజనాలు

భూ భారతి రీ-సర్వే ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. సర్వే సమయంలో రైతుల సమక్షంలోనే భూమికి నాలుగు వైపులా మార్కింగ్ చేసి, సరిహద్దు సమస్యలు లేదా పొజిషన్ మార్పులు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల పేర్లపై ఉన్న భూముల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య భవిష్యత్తులో సరిహద్దు వివాదాలు తలెత్తకుండా భూములను సక్రమంగా గుర్తించి పంపిణీ చేసుకోవడానికి రీ-సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

రైతులందరూ సర్వేకు హాజరు కావాలి

రీ-సర్వే నిర్వహించే సమయంలో సంబంధిత సర్వే నంబర్‌కు చెందిన ప్రతి రైతు ప్రత్యక్షంగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. పట్టాదారులు అందుబాటులో లేకపోతే వారి కుటుంబ సభ్యులు హాజరై తమ భూములను చూపించవచ్చని తెలిపారు. గ్రామ సభకు హాజరైన ప్రజలు ఈ సమాచారాన్ని గ్రామంలోని ఇతర రైతులకు కూడా తెలియజేసి, రీ-సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ, అడిషనల్ డైరెక్టర్ సర్వే ఆఫ్ ల్యాండ్స్, కీసర మండల తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**